



ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

తొలిరోజు సందడి

» పాఠశాలలు పున: ప్రారంభం.. విద్యార్థుల హాజరు అంతంతే..

వేసవి సెలవుల అనంతరం బడి గంట మోగింది. పాఠశాలలు పున: ప్రారంభమైన తొలిరోజు పండగ వాతావరణం కనిపించింది. స్కూళ్లలో మామిడి తోరణాలు కట్టి ముస్తాబు చేశారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు, గ్రామ పెద్దలకు ఉపాధ్యాయులు పూలతో స్వాగతం పలికారు. కాగా, గురువారం పాఠశాలల్లో విద్యార్థుల హాజరు అంతంత మాత్రంగానే ఉంది. కొన్ని పాఠశాలలు పిల్లలు అధిక సంఖ్యలో రావడంతో సందడిగా కనిపించింది. తొలిరోజు హాజరైన విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులు, యూనిఫాం పంపిణీ చేశారు.



మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో..



ఆదిభట్ల : రాందాస్‌పల్లి ప్రైమరీ స్కూలు విద్యార్థులకు పూలు అందజేసి స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు



శంకర్‌పల్లి : విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందిస్తున్న అధికారులు



మొయినాబాద్ రూరల్ : హిమాయత్ నగర్‌లోని పాఠశాల ఆవరణను శుభ్రం చేస్తున్న సిబ్బంది

పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలి

» డీఆర్‌డీవో పీడీ శ్రీలత

యాచారం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని డీఆర్‌డీవో పీడీ శ్రీలత సూచించారు. గురువారం అమ్మమాట-బడిబాట కార్యక్రమంలో భాగంగా యాచారం మండలం గున్‌గల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, పిల్లల తల్లులతో కలిసి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పిల్లలతో పనులు చేయించడం నేరమన్నారు. ప్రభుత్వ బడులలో రెండు జతల దుస్తులు, పౌష్టికాహారం అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ బడులలోనూ ఆంగ్ల బోధన సాగుతుందని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి పౌష్టికాహారం అందిస్తున్న తీరుపై ఆరా తీశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి ఎంపీడీవో బాలశంకర్, సీడీపీవో వినితాదేవి తదితరులున్నారు.



గున్‌గల్‌లో మొక్కలు నాటుతున్న డీఆర్‌డీవో పీడీ శ్రీలత

పకడ్బందీగా వంద రోజుల ప్రణాళిక

పురపాలన పట్టణాభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ జ్యోత్స్న

ఇబ్రహీంపట్నం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లో వంద రోజు ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని పురపాలన పట్టణాభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ జ్యోత్స్న ఆదేశించారు. గురువారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో తడి, పొడి చెత్తలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలని, ఆ దిశగా మున్సిపల్ సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. పచ్చదనం పెంపొందించేందుకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అంటురోగాలు ప్రబలే అవకాశం ఉన్నందున మురుగు నిల్వకుండా చూడాలన్నారు. తాగునీటి పైపులు లీకేజీ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందితో కలిసి అభివృద్ధి ప్రణాళిక షార్ట్‌ఫిలింను తిలకించారు. అనంతరం ఖానాపూర్ జేబీ వెంటర్‌లో నర్సరీని పరిశీలించారు. నాలుగో వార్డులో ప్రాథమిక పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు పూర్తిగా తొలగించాల్సిందిగా ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ పి.రవీంద్రసాగర్ తదితరులున్నారు.



పాఠశాల ఆవరణను పరిశీలిస్తున్న జ్యోత్స్న

తీరనున్న వెతలు!

పంచాయతీ కార్మికుల అకౌంట్లలోకి వేతనాలు

- బ్యాంకు ఖాతాల వివరాలు సేకరించిన జిల్లా పంచాయతీశాఖ
- గతంలో గ్రామ పంచాయతీల నుంచి చెల్లింపులు
- నూతన విధానంతో తొలగనున్న 3,091 మంది కష్టాలు

జిల్లావ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీ కార్మికుల వేతన వెతలు తీరనున్నాయి. ఇకపై జీతాలు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే కార్మికుల బ్యాంకు ఖాతాల వివరాలు జిల్లా పంచాయతీ శాఖ సేకరించింది. దీంతో పంచాయతీ సిబ్బంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పంచాయతీల నుంచి చెల్లింపులు జరగడంతో తీవ్రంగా ఆర్థిక ఇబ్బందులు పడ్డామని, ఇకపై ప్రతి నెలా మొదటి వారంలో వేతనాలు నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ కావడం వల్ల ఆ కష్టాలు ఉండవని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రంగారెడ్డి అర్బన్/చేవెళ్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పంచాయతీ పారిశుధ్య కార్మికుల కష్టాలు తీరనున్నాయి. ఇక నుంచి నెలనెలా జీతాలు వారి అకౌంట్‌లోనే పడనున్నాయి. ఇప్పటికే జిల్లా పంచాయతీ అధికారులు పారిశుధ్య కార్మికులు, సిబ్బంది బ్యాంకు ఖాతాల వివరాలు సేకరించారు. గతంలో వీరికి గ్రామ పంచాయతీల నుంచి జీతాలు ఇచ్చేవారు. దీనివల్ల సమస్యలు తలెత్తేవి. పంచాయతీ కార్యదర్శులు సమయానికి జీతాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో కుటుంబ పోషణ కష్టంగా మారేది. ఇప్పుడు నేరుగా అకౌంట్లోనే డబ్బులు జమకానుండటంతో పారిశుధ్య కార్మికులు ఎన్నో ఏళ్ల నుంచి

మిగతా 8వ పేజీలో...



చాలా సంతోషంగా ఉంది

చాలా సంవత్సరాలుగా గ్రామ పంచాయతీ కార్మికుడిగా సేవలందిస్తున్న. కొన్ని సార్లు వేతనాల కోసం ఎదురుచూసేవాళ్లం. ఇప్పుడు నేరుగా మా బ్యాంకు ఖాతాల్లోకి జీతం వేయడం సంతోషంగా ఉంది. ప్రభుత్వానికి కృతజ్ఞతలు. కార్మికుల సంక్షేమానికి మరిన్ని పథకాలు అమలు చేయాలి.

నర్సింహ, జీపీ కార్మికుడు, అంతారం, చేవెళ్ల మండలం

నాణ్యమైన పాలు అందిస్తాం

» విజయ డెయిరీ డీడీ మోహన్ మురళి



షాద్‌నగర్ అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలోని నగర వాసులకు నాణ్యమైన పాలను సరఫరా చేయడానికి కృషి చేస్తానని విజయ డెయిరీ డీడీ మోహన్ మురళి వెల్లడించారు. షాద్‌నగర్ డీడీగా పనిచేసిన శివాల్కార్‌యాదవ్ హెడ్‌క్వార్టర్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల డీడీగా పనిచేసిన మోహన్ మురళి బదిలీపై ఇక్కడికి వచ్చి గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన పాల సేకరణ కోసం షాద్‌నగర్ ప్రాంత పాడి రైతులను ప్రోత్సహిస్తామన్నారు. డీడీకి షాద్‌నగర్ పాల శీతలీకరణ మేనేజర్ సురేష్ ఘన స్వాగతం పలికారు.



నూతన విద్యా విధానంతో

అద్భుత ఫలితాలు

భారత ప్రభుత్వ ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ చైర్మన్ టీజీ సీతారాం

శంకర్‌పల్లిలోని ఇక్ఫాయ్ కళాశాలలో అంతర్జాతీయ విద్యావిధానంపై సదస్సు 7

ఆధునిక సాగుతో

అధిక లాభాలు

» డీఏవో నర్సింహారావు

షాబాద్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక పద్ధతిలో పంటలు సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు అన్నారు. గురువారం షాబాద్ మండల కేంద్రంలోని రైతు వేదికలో వికసిస్ కృషి సంకల్ప్ అభియాన్‌పై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఆధునిక వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు. అనంతరం ప్రధానమంత్రి ఫసల్‌బీమా, ఇతర రైతు సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, రోబోటిక్స్, కృత్రిమ మేధస్సు ఆటోమేషన్ తదితర ఆధునిక సాంకేతికతలు, ప్రయోగాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ అధికారులు నాగార్జున, భార్గవి, గౌతమ్‌చౌహాన్, అంజుబసీరా, చంద్రకాంత్, సుధీర్, శ్రీకృష్ణ, దిలీప్, ఏవో వెంకటేశం, సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్, రైతులు పాల్గొన్నారు.



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఒబేదుల్లా కొత్వాల్

మైనార్టీ కార్పొరేషన్ ద్వారా లక్ష కుటుంబాలకు ఉపాధి

» పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్లక్ష్యానికి గురైన ముస్లింలు

» మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్

ఆమనగల్లు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ మైనార్టీ మహిళా శక్తి పథకంలో భాగంగా రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 43 వేల మంది మహిళలకు కుట్టు మిషన్లు అందిస్తున్నట్లు కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ తెలిపారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముస్లింలు, మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని ఆయన పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణంలోని కళ్యాణి గార్డెన్‌లో గురువారం 167 మంది మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో మైనార్టీ కార్పొరేషన్ ద్వారా వివిధ పథకాల కింద లక్ష మైనార్టీ కుటుంబాలకు లబ్ధి చేకూర్చనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో వెయ్యి మంది సంచార ముస్లింలను గుర్తించి వారి ఉపాధి కల్పనకు రూ.10 కోట్లు సాయం అందించినట్లు తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా

మిగతా 8వ పేజీలో...

క్షయపై అవగాహన

అవసరం

షాద్‌నగర్‌రూరల్, జూన్12(ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధిని నిర్మూలించేందుకు ప్రతీ ఒక్కరు ప్రయత్నించాలని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ పాపారావు అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం అన్నారంలో గురువారం వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు వారాలకు పైగా దగ్గు ఉన్నా, రాత్రి వేళ చెమటలు పట్టడం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం తదితర లక్షణాలు ఉంటే వైద్య పరీక్ష చేయించుకోవాలని తెలిపారు. టీబీ ఉన్నట్లు తేలితే ప్రభుత్వమే ఉచితంగా మందులు ఇస్తుందన్నారు. అలాగే పౌష్టికాహారం కోసం ప్రతి నెలా వెయ్యి రూపాయలు అందచేస్తుందన్నారు. టీబీ ముక్త భారత్‌లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో 152మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 62మందిని టీబీ అనుమానితులుగా గుర్తించారు. డాక్టర్ రాఘవేందర్, డాక్టర్ శ్రీలత, హెల్త్ ఎడ్యూకేటర్ శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన

జిల్లాలో భారీ వర్షాలు.. శేరిలింగంపల్లిలో అత్యధికంగా 148.5మి.మీ నమోదు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం దంచికొట్టింది. నగర శివారు ప్రాంతాల్లో గురువారం తెల్లవారుజాము నుంచి పిడుగులు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షాలు కురిశాయి. దీంతో అనేకచోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలుచోట్ల వాగుల్లో వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. శేరిలింగంపల్లి సెంట్రల్ యూనివర్సిటీ పరిధిలో అత్యధికంగా 148.5మి.మీ వర్షపాతం నమోదైంది. అలాగే శేరిలింగంపల్లి ఎంఎంటీఎస్ వద్ద 114.3మి.మీ, చందానగర్ పీజేఆర్ స్టేడియంలో 109.8మి.మీ, గచ్చిబౌలిలో 81.3మి.మీ, మొయినాబాద్ కేతిరెడ్డిపల్లిలో 78.3మి.మీ, షాబాద్ మండలం తాళ్లపల్లిలో 71మి.మీ, మొయినాబాద్ మండలం రెడ్డిపల్లిలో 62.8మి.మీ, చందన్వెల్లిలో 68.8మి.మీ, చేవెళ్ల మండలం కందవాడలో 66.5మి.మీ, మొయినాబాద్‌లో 60.8మి.మీ, యాచారం మండలం నల్లవెల్లిలో 59మి.మీ, కేశంపేట 50.8 మి.మీ, రాజేంద్రనగర్‌లో 50మి.మీ, చౌదరిగూడెం కొసలాబాద్, షాబాద్‌లలో 47మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. సరూర్‌నగర్‌లో 33.5మి.మీ, శంకరపల్లిలో 31.5మి.మీ, షాద్‌నగర్, తలకొండపల్లిలో 28మి.మీ, మాడ్గులలో 26మి.మీ, మంచాలలో 24మి.మీ, కొందుర్గులో 23మి.మీ వర్షం కురిసింది. గురువారం సాయంత్రం నుంచి పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. ఇబ్రహీంపట్నం, యాచారం, మంచాల మండల పరిధిలో భారీ వర్షం కురిసింది. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వానాకాలం సీజన్ ఆరంభంలో కురుస్తున్న వర్షాలతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతున్నారు.



యాచారంలో కురుస్తున్న వర్షం

మోడల్ స్కూల్ అభివృద్ధి అభినందనీయం

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



చేవెళ్ల మోడల్ స్కూల్‌లో డైనింగ్ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ, పట్టుదలతో విద్యార్థులు బాగా చదువుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. గురువారం చేవెళ్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో అమెజాన్ కంపెనీ నిర్వాహకులు నూతనంగా నిర్మించిన డైనింగ్ హాల్, స్పోర్ట్స్ పరికరాలు, పాఠశాలకు రంగులు వేయడం వంటి వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అమెజన్ కంపెనీ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా చేవెళ్ల మోడల్ స్కూల్‌ను అభివృద్ధి చేయడం అభినందనీయం అన్నారు. అలాగే చేవెళ్లలోని కేజీబీవీ, నవాబ్‌పేట్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌ను సైతం అభివృద్ధి చేయాలని కంపెనీ నిర్వాహకులను ఎమ్మెల్యే కోరారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం చేవెళ్ల ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎంఈవో పురందాస్, ఇంటర్‌బోర్డు డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ చిన్నప్పరెడ్డి, చేవెళ్ల పీఏసీఎస్ ఛైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, మార్కెట్ ఛైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ ఛైర్మన్ రాములు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాండు, జె.లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ ఎం.విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్, నాయకులు కృష్ణారెడ్డి, వసంతం, రాములు, జహంగీర్, కాంగ్రెస్ చేవెళ్ల మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, అమెజాన్ కంపెనీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జుంటుపల్లి రైతులకు న్యాయం చేయాలి

బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్



కలెక్టరేట్ ఎదుట జుంటుపల్లి రైతులతో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్

వికారాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ రైతులకు అన్యాయం చేస్తున్నారని తెలంగాణ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, బీఆర్ఎస్ నేత ఎన్.శుభప్రద్ పటేల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వడ్ల బస్తాకు 41 కిలోలు కాంటా పెట్టడానికి బదులు 43 కిలోలు కాంటా పెడుతున్నారని ఆరోపించారు. రైస్ మిల్లర్లు సైతం 50 బస్తాలు ఉన్న రైతు దగ్గర రెండు బస్తాలు, 70 బస్తాలు ఉంటే మూడు బస్తాలు, 100 బస్తాలకు 5 బస్తాలు, 150 బస్తాలకు 8 బస్తాలు ధాన్యం తగ్గిస్తున్నారన్నారు. గురువారం యాలాల మండలం జుంటుపల్లి రైతులతో కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను కలిసి ధాన్యం విక్రయాల్లో రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. కలెక్టర్ స్పందిస్తూ రైతులతో మాట్లాడి న్యాయం చేయాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డీఎస్‌వోలను ఆదేశించారు. కార్యక్రమంలో రైతులు రాంచందర్, శాంతప్ప, గోవర్ధన్‌గౌడ్, ఎండీ సోను, గోవింద్, బీఆర్ఎస్ నాయకులు రవిశంకర్, సిద్ధిఖ్ పాల్గొన్నారు.

బషీరాబాద్‌లో రోడ్డుకు మరమ్మతులు



రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న అజయ్‌ప్రసాద్, తదితరులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బషీరాబాద్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): 'రోడ్డిలా.. ప్రయాణమెలా' అంటూ ఆదివారం ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి స్పందించారు. బషీరాబాద్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ వద్ద ప్రధాన బీటీ రోడ్డు గుంతలు పడి వర్షపు నీరు నిలిచి మడుగుగా తయారైంది. ఈ విషయాన్ని నవాంద్గీ సొసైటీ వైస్ ఛైర్మన్ అజయ్‌ప్రసాద్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రజలకు ఇబ్బందులు లేకుండా రోడ్డు బాగుకు చర్యలు తీసుకోవాలని సూచించడంతో అజయ్‌ప్రసాద్ బ్లాక్ కంకర, డస్ట్ తెప్పించి రోడ్డుపై పడిన గుంతలను పూడ్చివేయించారు. ఎట్టకేలకు గుంతల పూడ్చివేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మెంబర్ అనూప్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

అతిథి అధ్యాపకుల పోస్టులకు
దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ వికారాబాద్ యందు ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తునట్లు జిల్లా విద్యా శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ కే రామాచారి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిలాసఫీ సోషియాలజీ, సైకాలజీ, తెలుగు, ఆంగ్లం లో 2 చొప్పున ఖాళీలు, గణితం పెడగాగి, సైన్స్ అండ్ పెడగాగి, సోషల్ సైన్స్ పెడగాగి, వ్యాయామ విద్యా, విజువల్ ఆర్ట్స్, పెర్ఫామింగ్ ఆర్ట్స్ అలాగే ఉర్దూలో ఫిలాసఫీ/ సోషియాలజీ, ఉర్దూ లాంగ్వేజ్, మ్యాథ్స్ పెడగాగి, సైన్స్ పెడగాగి, సోషల్ పెడగాగికి సంబంధించిన పోస్టులకు నేటి నుంచి 19వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విశ్రాంత అధ్యాపకులు 65 ఏళ్లకు మించకూడదని, నిరుద్యోగ అభ్యర్థులు తగిన సబ్జెక్టులో పీజీ, ఎంఎడ్ వారు అర్హులన్నారు. మిగతా వివరాలకు 9441071533 నంబరులో సంప్రదించాలని ఆయన తెలిపారు.

నాలుగు వారాల్లో సమాధానం ఇవ్వాలి

పెరుమాండ్లకుంటలో మురుగు కలువడంపై హైకోర్టు ఉత్తర్వులు

ఘట్‌కేసర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పరిధిలోని పోచారంలో పెరుమాండ్లకుంటలో డ్రైనేజీ నీరు కలువకుండా చర్యలు చేపట్టాలని పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేసినా కనీస చర్యలు చేపట్టక పోవడంతో యువ న్యాయవాది చెరుకు భరద్వాజ్ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో గురువారం కోర్టు విచారణ జరిపి నాలుగు వారాల్లో సమాధానం చెప్పాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించింది. ఈ మేరకు న్యాయవాది భరద్వాజ్‌తోపాటు స్థానికులు మున్సిపల్ కమిషనర్‌ను కలిసి ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎగువన పెద్దఎత్తున నిర్మించిన బహుళ అంతస్తుల నుంచి పెద్దఎత్తున వెలువడుతున్న మురుగును దిగువన ఉన్న పెరుమాండ్లకుంటలోకి వదిలి పెడుతుండటంతో భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమవడమే కాకుండా పరిసరాలు తీవ్ర దుర్గంధ భరితంగా మారయని వాపోయారు. ఈ చెరువు పక్కనే ఉన్న శ్రీసర్వ మంగళాసమేత స్పటిక లింగేశ్వర స్వామి ఆలయం వద్ద భక్తులకు ఇబ్బంది కలుగుతున్నదని ఆరోపించారు. ఇప్పటికైనా ఇన్ఫోసిస్ ఐటీ పరిశ్రమ పక్కన నిర్మించిన బహుళ అంతస్తుల భవనాల యాజమానులు మురుగు నీటి శుద్ధి ప్లాంట్(ఎస్టీపీ) నిర్మించుకునేవిధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బీటీ రోడ్డు మంజూరు
చేయాలని వినతి

ఆమనగల్లు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దయ్యాలబోడు తండాకు బీటీ రోడ్డు నిర్మించాలని తండా గిరిజనులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డికి తండా నాయకులు వినతిపత్రం అందజేశారు. మేడిగడ్డ-శంకర్ కొండ రోడ్డు నుంచి అర కిలోమీటర్ బీటీ నిర్మిస్తే తమ తండాకు సౌకర్యంగా ఉంటుందని వినతి పత్రం లో పేర్కొన్నారు. నాయకులు రాజు, చంద్రునాయక్, మండ్లీ రాములు, విజయ్, విజయ్‌రాథోడ్, నవీన్, శ్రీను, రాజేశ్, కమ్లీ ఉన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

ధారూరు, జూన్12(ఆంధ్రజ్యోతి): ధారూరులోని ఫర్టిలైజర్ దుకాణంలో గురువారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనుమతిలేని పత్తి విత్తనాలు, క్రిమిసంహారక మందులు అమ్ముతున్నట్లు గుర్తించారు. స్టాక్ నిల్వ, అమ్మకాల వివరాల లెక్కలు సరిగా లేవని తేల్చారు. ఆ వివరాలను మండల ఏవో సూర్యప్రకాష్‌కు అప్పగించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధారూరులోని తుల్జాభవాని ఎరువుల, విత్తన విక్రయ దుకాణంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ మధన్‌మోహన్ రెడ్డి, తహసీల్దార్ గంగాప్రసాద్ తనిఖీ చేశారు. అనుమతులు లేకుండా విక్రయిస్తున్న 16 ప్యాకెట్ల పత్తి విత్తనాలను గుర్తించారు. క్రిమిసంహారక మందులకు సంబంధించి ఎనిమిది బ్రాండ్లు అనుమతులు లేకుండా అమ్ముతున్నట్లు గుర్తించారు. తనిఖీలు జరుగుతున్న సమాచారం అందుకున్న ఇతర ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు తమ దుకాణాలను మూసివేశారు. దీంతో అధికారులు ఒకే దుకాణాన్ని తనిఖీ చేసి వెళ్లిపోయారు. తర్వాత మూసివేసిన దుకాణాలను యజమానులు తెరిచి వ్యాపారం కొనసాగించడం విశేషం.

మోదీ పాలనలో
అద్భుత విజయాలు

ఆమనగల్లు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలనలో దేశం అద్భుత విజయాలు సాధించిందని బీజేపీ రాష్ట్ర నాయకుడు కండె హరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణగౌడ్, నియోజకవర్గ కో-కన్వీనర్ గోరటి నర్సింహ, జిల్లా కౌన్సిల్ మెంబర్ చెక్కాల లక్ష్మణ్‌లు అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని బీజేపీ కార్యాలయం వద్ద గురువారం ఆమనగల్లు మున్సిపాలిటీ అధ్యక్షుడు కర్నాటి విక్రమ్‌రెడ్డి అధ్యక్షతన మోదీ 11 ఏళ్ల పాలనపై వికసిత్ భారత్ అమృత్ కాల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో గణనీయమైన ప్రగతి సాధించిందన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్‌గా పురోగమించడానికి ప్రజలంతా బీజేపీ ప్రభుత్వంతో కలిసి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో రాంపాల్ నాయక్, దుర్గయ్య, రవిరాథోడ్, పద్మప్రశాంత్, ప్రవీణ్‌రెడ్డి తదితరులున్నారు.

హాజరుకు బయోమెట్రిక్ తప్పనిసరి

తాండూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): త్వరలో మండల, జిల్లా పరిషత్ కార్యాలయాల్లో ఫెస్షియల్ రికగ్నిషన్ గుర్తింపు హాజరును అమలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 16లోపు ఎంపీపీ, జడ్పీ కార్యాలయాల్లో బయోమెట్రిక్ హాజరు పరికరాలను ఏర్పాట్లు చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. జూలై 1 నుంచి ఈ విధానాన్ని పంచాయతీరాజ్ శాఖ అమలు చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఈ మేరకు ముఖ్య కార్య నిర్వహణ అధికారులకు ఆదేశాలు అందాయి. పారదర్శకత, క్రమశిక్షణ ఉండడానికి ఈ విధానం అమలు చేస్తున్నట్లు ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఇప్పటికే గ్రామ పంచాయతీలలో డీఎస్ఆర్ యాప్‌ను పంచాయతీ కార్యదర్శులు తిరస్కరిస్తున్న విషయం విధితమే. మండల పరిషత్, జిల్లా పరిషత్‌లలో ఈ విధానం వల్ల ఇబ్బందులు తలెత్తుతాయని మండల పరిషత్ కార్యాలయ అధికారులు పెదవి విరుస్తున్నారు. వికారాబాద్ జిల్లాలో 20 మండల పరిషత్, ఒక జిల్లా పరిషత్ ఉంది. మండల పరిషత్‌లో ఎంపీడీఓ, సూపరింటెండెంట్, ఎంపీఓ, ఏఈ, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు ఉన్నారు. ఈ విధానం అమలు చేస్తే ఎంపీపీ, జడ్పీ అధికారులు ఆందోళన బాట పట్టే అవకాశాలున్నాయి.

డీజిల్‌కు డబ్బుల్లేవు.. ట్రాక్టర్లు నడుపలేం



ఎంపీడీవోకు ట్రాక్టర్ల తాళాలను అప్పగిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ధారూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అధికారుల పాలనలో డీజిల్‌కు డబ్బులు లేవని, ట్రాక్టర్లను నడపలేకపోతున్నామని ట్రాక్టర్ల తాళాలను గురువారం ఎంపీడీవో నర్సింహులకు పంచాయతీ కార్యదర్శులు అప్పగించారు. ఈ సందర్భంగా వారు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోకు మెమోరాండం అందించారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసినప్పటి నుంచి పంచాయతీలకు ప్రభుత్వం నుంచి నిధులు రావటం లేదన్నారు. పంచాయతీల్లో వివిధ పనుల కోసం తమ వేతనాలను ఖర్చు చేస్తున్నామని, అప్పులు తెచ్చి ట్రాక్టర్లకు డీజిల్ పోయించి నడిపించామని వాపోయారు. ఇక పంచాయతీల నిర్వహణ భారం తమ వల్ల కాదని, ఆర్థిక పరమైన విధులను బహిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు సంజీవ్, రామ్‌విహార్, మండల శాఖ అధ్యక్షుడు ఆరీఫ్ ఖాన్, ఉపాధ్యక్షురాలు సుమలత పాల్గొన్నారు.

నాటక రంగాన్ని
కాపాడుకుందాం

షాద్‌నగర్ అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): హిందూ సాంప్రదాయం, సంస్కృతికి అద్దం పడుతున్న నాటక రంగాన్ని బతికిస్తూ, భవిష్యత్తు తరాలకు అందించడానికి ప్రతీఒక్కరు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు కాశన్న పిలుపునిచ్చారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని రామేశ్వరం పుణ్యక్షేత్రంలో పౌర్ణమిని పురష్కరించుకుని బుధవారం రాత్రి శ్రీకృష్ణ రాయబారం, పౌరాణిక పద్య నాటకాన్ని ప్రదర్శించారు. తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ, దేవాదాయ ధర్మదాయశాఖ సౌజన్యంతో రంగక్షేత్ర, రంగస్థల కళల శిక్షణాలయం, నటమండలి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన నాటకానికి డి. కాశన్న హాజరై మాట్లాడారు. శ్రీ గేజేశ్వర నాట్య కళా మండలి కళాకారులు అద్భుతంగా శ్రీకృష్ణ రాయభారం నాటకాన్ని ప్రదర్శించారని అభినందించారు. ప్రతీ పౌర్ణమి రాత్రి ఒక కళా బృందానికి అవకాశం ఇస్తూ, నాటక ప్రదర్శనలను కొనసాగిస్తున్నట్టు రంగక్షేత్ర నట శిక్షణాలయం-నట మండలి అధ్యక్షుడు జెఎస్వీ శివ ప్రసాద్ తెలిపారు. నాటక ప్రదర్శనను భక్తులు తిలకించి, అభినందించారు.

యువతకు ఉద్యోగం, ఉపాధి

» టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి



లెర్నింగ్ లైసెన్స్‌లు పంపిణీ చేస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): యువతకు ఉపాధి, ఉద్యోగ కల్పనకు ఐక్యత ఫౌండేషన్ కృషి చేస్తుందని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లులోని ఐక్యత ఫౌండేషన్ కార్యాలయం వద్ద గురువారం లెర్నింగ్ లైసెన్స్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐక్యత ఫౌండేషన్ సహకారంతో 24 గ్రామ పంచాయతీలకు చెందిన 90 మందికి ఉచితంగా లెర్నింగ్ లైసెన్స్‌లు అందజేసినట్లు తెలిపారు. యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన సుమారు 300 మందికి వివిధ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రాజ్, ప్రతాప్‌రెడ్డి, ఇస్తారి, విజేందర్‌రెడ్డి, వినోద్‌రెడ్డి, పరమేశ్, తిరుపతిరెడ్డి, రవి, మహేందర్, శివప్రసాద్, రమేశ్, గణేశ్, శ్రీపతి, శేఖర్, శ్రీను, పాల్గొన్నారు.

విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం



పీజీ సెమిస్టర్ ఫలితాలను విడుదల చేస్తున్న సాత్వికరెడ్డి

మొయినాబాద్ రూరల్, జూన్12(ఆంధ్రజ్యోతి): తమ విద్యాసంస్థల్లో విద్యనభ్యసించే విద్యార్థులను ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్లడమే లక్ష్యమని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ డెరెక్టర్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సాత్వికరెడ్డి అన్నారు. ఇప్పటికే అనేక మంది దేశ, విదేశాల్లో ఉన్నతస్థాయిలో స్థిరపడ్డారన్నారు. మండలంలోని హిమాయత్‌నగర్ గ్రామంలోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలోని ఎంఎస్సీ, ఎంసీఏ, ఎంబీఏ ఎంటెక్ మొదటి సంవత్సరం పీజీ సెమిస్టర్ ఫలితాలను గురువారం విడుదల చేశారు. కార్యక్రమంలో డీన్ అడ్మినిస్ట్రేటివ్ రాజు, సుందర్‌రావు, పవన్ కుమార్, రాజేందర్ రెడ్డి, శ్రీలత, రాజేశ్వరీ, కుమారస్వామి, సురేష్, విజయ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ గాదె రాంబాబు రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ విభాగం అధ్యక్షుడిని కలిసిన నరేందర్



శంషాబాద్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం నూతన అధ్యక్షుడిగా నియమితులైన రాజేంద్రపాల్ గౌతంను విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు, శంషాబాద్‌కు చెందిన జె.నరేందర్ గురువారం న్యూఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమేరకు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించినట్లు నరేందర్ పేర్కొన్నారు.

అనుమతి లేని రిసార్టును సీజ్ చేయాలి

చేవెళ్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా మండల పరిధిలోని ఈర్లపల్లి రెవెన్యూలో కొనసాగిస్తున్న త్రిపుర రిసార్టును సీజ్ చేయాలని సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ఆర్డీవో చంద్రకళకు వినతిపత్రం అందించారు. చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ తదితర మండలాల్లో అనుమతి లేకుండా కొనసాగుతున్న రిసార్టులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. శ్రీనివాస్, చంద్రశేఖర్, చందు తదితరులు ఉన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఆమనగల్లు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ ఆమనగల్లు మండలాధ్యక్షుడు ఎర్రవోలు శ్రీను పిలుపునిచ్చారు. మోదీ పాలనా దక్షతతో 11 ఏళ్లలో దేశం అద్భుత విజయాలు సాధించిందన్నారు. మండల బీజేపీ కార్యకర్తల సమావేశాన్ని గురువారం స్థానిక బీజేపీ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు కాసుల వెంకటేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శ్రీను, వెంకటేశ్ మాట్లాడుతూ దేశం అన్ని రంగాల్లో గణనీయమైన ప్రగతి సాధించిందన్నారు. నాయకులు గోరేటి నరసింహ, భగవాన్‌రెడ్డి, సీతారామారావు, మల్లేశ్, శ్రీనివాస్, తదితరులున్నారు.

ఉత్సాహంగా ట్రాక్టర్ రివర్స్ గేర్ పోటీలు



చెన్నారంలో ట్రాక్టర్స్ రివర్స్ గేర్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ గిరి

యాలాల, జూన్ 12, (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ రివర్స్ గేర్ పోటీలు ఎంతోమంది ట్రాక్టర్ డ్రైవర్లలో ఉత్తేజాన్ని నింపుతాయని ఎస్ఐ గిరి పేర్కొన్నారు. మండలంలోని చెన్నారంలో స్వర్గీయ కృష్ణారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు పవన్‌రెడ్డి ఏరువాక పౌర్ణమి సందర్భంగా గురువారం ఈ పోటీలు ఏర్పాటు చేయగా ఎస్ఐ ప్రారంభించారు. ఈ పోటీల్లో దాదాపు 75 మంది రైతులు తమ ట్రాక్టర్లతో పాల్గొన్నారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి గెలుచుకున్న లక్ష్మీనారాయణపూర్ గ్రామానికి చెందిన రమేశ్‌కు రూ.4వేలు, ముకుందాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మణ్‌కు రెండో బహుమతి రూ.2వేలు, తిమ్మాయిపల్లికి చెందిన కిష్టప్పకు మూడో బహుమతి కింద రూ.వెయ్యి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివకుమార్, కాంగ్రెస్ నాయకులు అనిల్‌కుమార్, మల్లప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.

బజ్జి మిర్చి పంట పరిశీలన

చేవెళ్ల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కాత, పూత లేక బజ్జి మిర్చి పంట వేసి నష్టపోయిన రైతుల పొలాలను ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు గురువారం పరిశీలించారు. చేవెళ్ల మండల పరిధిలోని చన్వెల్లి, పామెన గ్రామాల్లో బజ్జి మిర్చి పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు వీర సురేష్, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి సురేష్ మాట్లాడుతూ.. నష్ట కారణాలను పరిశీలించి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. బజ్జి మిర్చి పంట ఏపుగా పెరిగి కాత పూత లేదని పలువురు రైతులు శాస్త్రవేత్తల దృష్టికి తీసుకువచ్చారు. చేవెళ్ల ఏవో శంకర్‌లాల్, ఉద్యాన శాఖ అధికారి కీర్తి, పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య

శామీర్‌పేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యకోసం పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని డీఈవో విజయకుమారి అన్నారు. గురువారం శామీర్‌పేట మండలంలోని అలియాబాద్, శామీర్‌పేట, లాల్‌గడి మలకపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఎంఈవో కమలాకర్‌తో కలిసి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, నోట్‌బుక్కులను అందజేశారు. లాల్‌గడీమలకపేట పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

నూతన విద్యావిధానంతో అద్భుత ఫలితాలు

భారత ప్రభుత్వ ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ చైర్మన్ టీజీ సీతారాం

శంకర్‌పల్లిలోని ఇక్ఫాయ్ కళాశాలలో అంతర్జాతీయ విద్యావిధానంపై సదస్సు





కార్యక్రమంలో మాట్లాడుతున్న సీతారాం

శంకర్‌పల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : దేశంలో జాతీయ విద్యా విధానం ప్రవేశపెట్టిన నాలుగేళ్లలో ఉన్నతమైన ఫలితాలను సాధిస్తుందని భారత ప్రభుత్వ ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ చైర్మన్ టీజీ సీతారాం తెలిపారు. గురువారం రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండల పరిధిలోని ఇక్ఫాయ్ విశ్వవిద్యాలయంలో జాతీయ విద్యావిధానం 2020పై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా సీతారం, విశిష్ట అతిథిగా మణిపాల్ అకాడమి ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చాన్సలర్ లెఫ్టినెంట్ జనరల్ డాక్టర్ వెంకటేశ్, ఇక్ఫాయ్ కళాశాల వైస్ చాన్సలర్ ఎల్ఎస్. గణేశ్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో పాఠశాల, ఉన్నత విద్యావ్యవస్థలో పరివర్తన, సంస్కరణలకు మార్గం సుగమం చేస్తూ జాతీయ విద్యావిధానం 2020లో ప్రవేశపెట్టబడిందన్నారు. 21వ శతాబ్దపు అవసరాలకు అనుగుణంగా ప్రతీ విద్యార్థి ప్రత్యేక సామర్థ్యాలను సరళంగా, బహుళ విధాలుగా బయటకు తీసుకు రావడం లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. ప్రపంచంలోనే జ్ఞాన రంగంలో సూపర్‌గా మార్చడంలో నూతన విద్యావిధానం నిమగ్నమై సఫలీకృతమవుతోందన్నారు. 2047 సంవత్సరానికి ప్రధాన మంత్రి ఆశించినట్లుగా ప్రపంచంలోనే దేశ జీడిపిలో ఉన్నతమైన ఫలితాలను సాధించి అగ్రస్థానాన్ని ఆక్రమిస్తుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ బీజే.రావు, హైదరాబాద్‌లోని ఐఐఐటీ డైరెక్టర్ బీఎస్.మూర్తి, ఐఐటీ డైరెక్టర్ పీజే. నారాయణ, ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కెఎస్.సత్యనారాయణ, జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ టీఎస్.కిషన్‌కుమార్‌రెడ్డి, టాటా ఇనిస్టిట్యూట్ రీసెర్చ్ డైరెక్టర్ ఎం.కృష్ణమూర్తి, యూజీసీ డిప్యూటి సెక్రటరీ లెఫ్టినెంట్ కమాండర్ వినోద్‌సింగ్‌యాదవ్, ఇక్ఫాయ్ బిజినెస్ స్కూల్ డైరెక్టర్ కెఎస్. వేణుగోపాల్, ఆర్.ప్రసాద్, భాస్కరరావు, సంజీబ్‌దత్తా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మూతబడింది!

» తెరుచుకోని జంషేడ్‌పూర్ ప్రాథమిక పాఠశాల



తెరుచుకోని మర్పల్లి మండలంలోని జంషేడ్‌పూర్ ప్రాథమిక పాఠశాల

మర్పల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా గురువారం పాఠశాలలు అట్టహాసంగా ప్రారంభమైనా మండలంలోని జంషేడ్‌పూర్ ప్రాథమిక పాఠశాల తెరుచుకోలేదు. గతంలో ఈ బడిలో 40 మందికిపైగా విద్యార్థులుండగా గతేడాది ఉపాధ్యాయుల బదిలీల్లో ఉన్న ఉపాధ్యాయుడు బదిలీపై వెళ్లాడు. దీంతో ఇక్కడి విద్యార్థులు సంగారెడ్డి జిల్లాలోని దిగ్వాల్, జహీరాబాద్ తదితర ప్రాంతాల్లోని పాఠశాలలకు వెళ్లిపోయారు. దీంతో అప్పటినుంచి పాఠశాల మూతపడింది. తిరిగి ఫిబ్రవరిలో ఆ పాఠశాలకు ఒక ఉపాధ్యాయుడిని నియమించగా విద్యార్థులు లేకపోవడంతో గ్రామంలోని ఐదుగురు పిల్లలను పాఠశాలలో చేర్పించారు. కానీ వారు కూడా సరిగా పాఠశాలకు హాజరుకాలేదు. గ్రామంలోని పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు చేపట్టిన బడి బాట కార్యక్రమంలో ఉపాధ్యాయుడు హాజరుకాలేదు. కేవలం పంచాయతీ కార్యదర్శి, ఆశా కార్యకర్తలతో నామమాత్రంగా బడిబాట నిర్వహించి చేతులు దులుపుకున్నారు. ఇప్పటికైనా పాఠశాల తెరుచుకుంటే తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు సిద్ధంగా ఉన్నామని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. ఈ విషయంపై ఎంఈవో అంజిలప్పను వివరణ కోరగా పాఠశాలలో ఐదుగురు విద్యార్థులు ఉన్నారని, ప్రభుత్వ ఉపాధ్యాయుడిని కూడా నియమించామని తెలిపారు. పాఠ్యపుస్తకాలు, నోటు బుక్కులు సైతం పంపిణీ చేసినట్లు చెప్పారు. ఉపాధ్యాయుడు విధులకు హాజరుకాని పక్షంలో చర్యలు తీసుకుంటామని తెలిపారు.



దండుమైలారంలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

సర్కారు బడుల బలోపేతానికి చర్యలు

» ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడులకే పంపాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కోరారు. పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా గురువారం మండల పరిధిలోని దండుమైలారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం, నోటు బుక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పైసా ఖర్చు లేకుండా సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. తమ పరిధిలోని ఏ పాఠశాలలో అయినా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో హీర్యానాయక్, ఇబ్రహీంపట్నం, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్లు కె.గురునాథ్‌రెడ్డి, చిలుక మధుసూదన్‌రెడ్డి, ఉప్పరిగూడ ప్యాక్స్ చైర్మన్ ఏదుల్ల పాండురంగారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు గోవర్ధన్ పాల్గొన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న బైకులు, అదుపులో నిందితుడు

అంతర్ జిల్లా బైక్‌ల దొంగ అరెస్టు

తాండూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా తాండూరు మండల పరిధిలో అంతర్ జిల్లా మోటార్ సైకిళ్ల దొంగను అరెస్టు చేశారు. నిందితుడు యాలాల మండలం కమల్‌పూర్‌నకు చెందిన ఆటో డ్రైవర్ బోయిని శ్రీకాంత్(24)ను గురువారం తాండూరులో విలియమూన్ చౌరస్తా వద్ద పోలీసులు వాహనాలు తనిఖీల్లో పట్టుకున్నారు. శ్రీకాంత్ బైక్‌పైరాగా డాక్యుమెంట్లు చూపాలని అడుగగా అతడు బైక్‌ను వదిలి పారిపోతుండగా పట్టుకున్నారు. హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో 15మోటారు సైకిళ్లను చోరీచేసి పది బైక్‌లను తాండూరు మండలం బిజ్వారం వాసులకు విక్రయించాడు. నాలుగింటిని తర్వాత తన ఇంటి వద్ద పెట్టాడు. దొంగలించిన మోటార్ సైకిళ్లలో తాండూరు, సైబరాబాద్, అల్లాపూర్, చందానగర్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. గతంలోనూ యాలాల, కూకట్‌పల్లి, మియాపూర్, సనత్‌నగర్, బంజారా హిల్స్, బాచుపల్లి, చందానగర్, మధాపూర్ ప్రాంతాల్లో 20కేసుల్లో జైలుకు వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సంతోష్‌కుమార్ చెప్పారు. నిందితుడి వద్ద రూ.7.5లక్షల విలువ చేసే బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ, ఎస్ఐ సాజిద్, క్రైమ్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ అంజాద్, శివకుమార్, కానిస్టేబుల్ సాయప్ప, షకీల్ అహ్మద్‌లను ఎస్పీ నారాయణరెడ్డి అభినందించారు.

ఇంటర్‌లో అడ్మిషన్లకు ఇంటింటికీ ప్రిన్సిపాల్

యాచారం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్‌మీడియట్ చేరే విద్యార్థులు యాచారంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఎంచుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ కోరుతున్నారు. ఆయనతోపాటు లెక్చరర్లు మండలంలోని మాల్, మేడిపల్లి, తమ్మలోనిగూడ, గున్‌గల్, నందివనపర్తి, చౌదర్‌పల్లి, తక్కళ్లపల్లి, మల్కీజ్‌గూడ తదితర గ్రామాల్లో నాలుగు రోజులుగా విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కలిసి కోరుతున్నారు. కళాశాలలో నాణ్యమైన బోధనతోపాటు అన్ని సౌకర్యాలున్నాయని వివరిస్తున్నారు. ఫీసు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్, విద్యార్థుల ప్రతిభ, మార్కులు, వచ్చిన ర్యాంకుల గురించి వివరిస్తున్నారు. కళాశాలలో ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వంద శాతం ఫలితాలే లక్ష్యంగా బోధన అందిస్తున్నామని ప్రిన్సిపాల్ చెబుతున్నారు.



నందివనపర్తిలో అడ్మిషన్ తీసుకోవాలని విద్యార్థులను కోరుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు



విద్యార్థులకు యూనిఫామ్, బుక్స్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

విద్యాభివృద్ధితోనే సమగ్రాభివృద్ధి

షాద్‌నగర్ అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా గురువారం షాద్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భాగ్యమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై విద్యార్థులకు యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు పంపిణీ చేశారు. అలాగే పదో తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండల విద్యాధికారి మనోహర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్, తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు ప్రహరీ నిర్మించాలి

షాద్‌నగర్ అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వైష్ణవ సంప్రదాయం ప్రకారం పార్థివదేహాలను ఖననం చేస్తున్న శ్మశానవాటికకు ప్రహరీ నిర్మించి, వసతులను కల్పించాలని కుల సంఘాల నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసి వినతిపత్రాన్ని ఇచ్చారు. షాద్‌నగర్ మినీ స్టేడియం పక్కన 30 ఏళ్ల క్రితం దాతల సహకారంతో నిర్మించిన శ్మశానవాటిక ప్రహరీ కూలిపోయిందని, సౌకర్యాలు కూడా కొరవడ్డాయని ఆర్యవైశ్య, రెడ్డి, బ్రాహ్మణ, మార్వాడి, పద్మశాలి, విశ్వబ్రాహ్మణ తదితర సంక్షేమ సంఘాల నాయకులు గురువారం ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో కలిశారు. సమస్యపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి ప్రభుత్వానికి నివేదించి, ప్రహరీతోపాటు సౌకర్యాలను కల్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు గందే సురేష్, మలిపెద్ది శ్రీనివాస్, పెద్ది రామ్మోహన్, యంసాని శ్రీనివాస్, ఆగీరు రవి, సారాపు జగదీష్, కొప్పుల మధన్‌మోహన్‌రెడ్డి, చెంది తిరుపతిరెడ్డి, కోట జనార్దన్, వెంకటేశ్వర్‌రావు, జగదీశ్ కండేల్వాల్, రాధేశ్యాం, కొందూటి రవి పాల్గొన్నారు.

రోడ్లపై చెత్తవేస్తే జరిమానా తప్పదు

మహేశ్వరం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై చెత్తవేస్తే జరిమానా తప్పదని తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్ వాణి అన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం మున్సిపల్ పరిధిలో పలు వార్డుల్లో కాలనీవాసులకు అవగాహన కల్పించారు. రోడ్లపై చెత్త వేసినపలువురుని గుర్తించి జరిమానా విధించారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న సుధీర్

వికారాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల్లో అన్ని వసతులు కల్పిస్తూ నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ఉచిత పుస్తకాలు, నోటు బుక్కులు, యూనిఫాం అందిస్తున్నామని వికారాబాద్ అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. గురువారం వికారాబాద్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పిల్లలకు పుస్తకాలు, యూనిఫాం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నారని, విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో బాబుసింగ్, ఏఏపీసీ చైర్మన్ విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు వీరేశం పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో తస్మాత్ జాగ్రత్త

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా అంటూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. కలెక్టరేట్‌లో దోమల ద్వారా సంక్రమించే వ్యాధుల నియంత్రణపై సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో దోమ కాటు వల్ల మలేరియా, డెంగీ, చికెన్‌గన్య వంటి వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. గ్రామాల్లో వైద్యులు, ఆశా వర్కర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులపై కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, సమాచారం నిమిత్తం 97027 05161 ను సంప్రదించాలని కోరారు. సమావేశంలో డీటీడీవో కమలాకర్ రెడ్డి, డీబీసీడీవో ఉపేందర్, ఇంటర్మీడియట్ జిల్లా అధికారి శంకర్ నాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీంద్ర యాదవ్ పాల్గొన్నారు..

ప్రకృతి వనాలు ఆహ్లాదానికి దోహదం



కొడంగల్ ప్రకృతి వనంలో షటిల్ ఆడుతున్న తిరుపతిరెడ్డి, నాయకులు

» కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి

కొడంగల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వనాలు ఆహ్లాదకర వాతావరణానికి దోహదపడతాయని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతి రెడ్డి అన్నారు. గురువారం కొడంగల్ మున్సిపల్ పరిధిలోని లాహోటీ కాలనీలో రూ.కోటీ 20 లక్షలతో హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వనం, క్రీడా ప్రాంగణాన్ని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బలరామ్‌నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎన్.ప్రశాంత్ తదితరులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రకృతి వనంలో మొక్కలు నాటి నీరు పోశారు. క్రీడా ప్రాంగణంలో వాకింగ్ ట్రాక్, ఆట వస్తువులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభివృద్ధిలో కొడంగల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ, హెచ్ఎండీఏ అధికారులు సత్యనారాయణమ్మ, సౌమ్య, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నయీమ్, దాము, నర్సిములుగౌడ్, రాంచంద్రారెడ్డి, ఆవుటి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



కొత్తూర్ : జడ్పీహెచ్ఎస్‌లో పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేస్తున్న తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంఈవో అంగోర్‌నాయక్



కేశంపేట : పాపిరెడ్డిగూడ పాఠశాలలో యూనిఫాం అందిస్తున్న ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్



తలకొండపల్లి : గట్టిప్పలపల్లి స్కూల్లో టీచర్లు, విద్యార్థులు, నాయకులు

ఉత్సాహంగా విద్యార్థుల 'బడి బాట'

వేసవి సెలవులు ముగియడంతో గురువారం జిల్లావ్యాప్తంగా పాఠశాలలు తెరుచుకున్నాయి. తొలిరోజు చాలా పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం తక్కువ సంఖ్యలో నమోదైంది. కొన్ని పాఠశాలలకు ఒకరిద్దరు విద్యార్థులు మాత్రమే రావడం గమనార్హం. ఉపాధ్యాయులు కూడా అందరూ హాజరు కాలేదు. విద్యార్థులకు టీచర్లు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. పలు చోట్ల టీచర్లు, విద్యార్థులు, పారిశుధ్య సిబ్బంది పాఠశాలలను శుభ్రం చేసుకోవడం కన్పించింది. కొన్ని బడుల్లో విద్యార్థులు మధ్యాహ్నానికే ఇంటి బాట పట్టారు. మొదటిరోజు స్కూళ్లను విద్యాధికారులు సందర్శించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, టీచర్లు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేశారు.



చేవెళ్ల : మండల కేంద్రంలోని పాఠశాల ఆవరణలో ఆటలు ఆడుకుంటున్న విద్యార్థులు



షాబాద్ : బాలికల ఉన్నత పాఠశాలలో ఇద్దరు విద్యార్థులతోనే ప్రార్థన చేయిస్తున్న ఉపాధ్యాయులు



షాబాద్ : విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం అందజేస్తున్న గుడిమల్కాపూర్ ఏఎంసీ వైస్‌చైర్మన్ చంద్రశేఖర్



యాచారం : నందివనపర్తి పాఠశాలలో పాఠ్యపుస్తకాలు అందిస్తున్న బీఎస్‌రెడ్డి ట్రస్ట్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు



కందుకూరు : నేదునూరు ఆదర్శ పాఠశాలలో పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ విష్ణుప్రియ

తీరనున్న వెతలు!

(ఐదో పేజీ తరువాయి)

ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారం కానుంది. జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల వివరాలను పంచాయతీరాజ్‌శాఖ సేకరించింది. వాటిని ఈ-పంచాయత్ వెబ్‌సైట్‌లో నమోదు చేసింది. జిల్లాలో 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 558 గ్రామ పంచాయతీలు ఉండగా, ఈసారి 27 గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీల్లో విలీనమయ్యాయి. మిగిలిన 531 గ్రామ పంచాయతీల్లో 3018 మంది పారిశుధ్య కార్మికులు, 73 మంది కంప్యూటర్ ఆపరేటర్లు విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ఒక్కొక్కరికి నెలకు రూ.9500 జీతం అందిస్తారు. వీరందరికీ మే నెలకు సంబంధించి 2.93 కోట్ల రూపాయల వేతనం రావాల్సి ఉంది. ఈ జీతాలు ఈ నెలలో పంచాయతీ సిబ్బంది ఖాతాల్లో జమ కానున్నాయి. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల పారిశుధ్య కార్మికుల కుటుంబాల్లో ఆర్థికంగా స్థిరత్వం పొందనున్నారు.

నూతన విధానంతో..

ఈ నూతన విధానం గ్రామ పంచాయతీ కార్మికులకు ఎన్నో ప్రయోజనాలను అందిస్తుంది. ప్రతి నెలా మొదటి వారంలో వేతనాలు నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ కావడం వల్ల కార్మికులు ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడతారు. అప్పులు తీసుకొని ఇబ్బందులు పడాల్సిన అవసరం ఉండదు. ఇది వారి కుటుంబాల ఆర్థిక భద్రతను పెంచుతుంది. ఆన్‌లైన్ విధానం ద్వారా వేతనాల చెల్లింపు, నిధుల వినియోగంలో పారదర్శకతను తెస్తుంది. కార్మికులు తమ వేతనాల వివరాలను సులభంగా తెలుసుకోవచ్చు. కాగా ఈ నిర్ణయం పట్ల కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే, చాలా కాలంగా చేసిన పోరాటం తర్వాత వారి కష్టానికి తగిన గుర్తింపు లభించడం వారిలో ఆనందాన్ని నింపింది.

ఆర్థిక కష్టాలు తీరుతాయి



మా కష్టాన్ని గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్మికులకు ప్రతి నెలా బ్యాంకు ఖాతాల్లో వేతనాలు వేస్తామని చెప్పడం ఆనందంగా ఉంది. సకాలంలో డబ్బులు చేతికొస్తే పిల్లల చదువులు, ఇంటి ఖర్చులు చూసుకోవచ్చు. ఇక తమకు ఆర్థిక కష్టాలు తీరుతాయి. ఇదివరకు చెక్కుల మార్పిడికి బ్యాంకుకు వెళ్లాల్సి వచ్చేది.

- నరేష్, జీపీ కార్మికుడు, సింగప్పగూడ, చేవెళ్ల మండలం

పోరాటానికి ఫలితం దక్కింది



పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ, కార్మిక అనుబంధ సంఘాలు ఎన్నో సంవత్సరాలుగా ప్రభుత్వంపై పోరాట ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం దిగి వచ్చి కార్మికుల కష్టానికి తగిన గుర్తింపు లభించింది. గతంలో సకాలంలో కార్మికులకు వేతనాలు అందకపోవడంతో కార్మికుల పరిస్థితి ఇబ్బందిగా ఉండేది. ప్రభుత్వం కార్మికులకు బ్యాంకు ఖాతాల్లో వేతనాలు జమ చేస్తామని తీసుకున్న నిర్ణయంతో కార్మికుల జీవితాల్లో వెలుగులు నిండుతాయి.

- అల్లి దేవేందర్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి

కార్మికులకు ఆర్థిక భరోసానిస్తుంది



పంచాయతీ కార్మికుల శ్రమను ప్రభుత్వం గుర్తించింది. నేరుగా వేతనాలు అందించడం ద్వారా వారి ఆర్థిక భద్రతకు భరోసా కలుగుతుంది. అంతే కాకుండా గ్రామాల్లో పారిశుధ్య పనులు మరింత సమర్థవంతంగా జరిగేలా ఇది ప్రోత్సహిస్తుంది. త్వరలోనే పంచాయతీ కార్మికుల ఖాతాల్లో వేతనాలు జమవుతాయి.

- హిమబిందు, ఎంపీడీవో, చేవెళ్ల

తలారి శ్రీనివాస్‌కు అంబేడ్కర్ రత్న అవార్డు



మొయినాబాద్ రూరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నమంగళారం గ్రామానికి చెందిన తలారి శ్రీనివాస్‌ను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దళితరత్న అవార్డు వరించింది. ఈ మేరకు నగరంలోని ఖైరతాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర మాలల సమితి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఆలిండియా రైట్స్ ప్రొటక్షన్ అధ్యక్షులు రాజు వస్తాద్, టీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బరిగెల వెంకటస్వామి, అంబేడ్కర్ ఉత్సవ కమిటీ చైర్మన్ చెరుపు రాంచందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో తలారి శ్రీనివాస్‌కు అవార్డును అందచేశారు.

బీసీలు సంఘటితం కావాలి

షాబాద్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): బీసీలు సంఘటితం కావాలని బీసీ సేన యువజన విభాగం మండలాధ్యక్షుడు అజయ్‌కుమార్ అన్నారు. బీసీసేన మండల యువజన విభాగం అధ్యక్షుడిగా బండ అజయ్‌కుమార్, వైస్‌ప్రెసిడెంట్‌గా కుమ్మరి మాణిక్యంలను ఎన్నుకున్నారు. గ్రామస్థులు వారిని ఘనంగా సన్మానించారు.

పాఠశాల అభివృద్ధికి చేయూత

మంచాల, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఆ రుట్ల ప్రభుత్వ పాఠశాల అభ్యున్నతికి చేయూనందిస్తామని పూర్వ విద్యార్థులు అన్నారు. ఆరుట్ల జెడ్పీ హైస్కూల్‌కు చెందిన పూర్వవిద్యార్థులు ఎండీ.జానీపాషా, పున్నం రాము, ఎండీ ఆసిఫ్, నూకం మల్లేష్, ఎండీ.అమీర్‌బాబ, బూర ప్రభాకర్, జిలమోని శ్రీనివాస్, ఎన్నిదుల రాకేష్, సంతోష్‌రెడ్డి, రావుల రాజు, దేవరాజ్‌లు గురువారం బడిబాట కార్యక్రమంలో పాల్గొని పలువురు చిన్నారులకు అడ్మిషన్లు కల్పించారు.

మోస్తరు నుంచి భారీ వర్షం



చేవెళ్ల : జడ్పీహెచ్ఎస్(బాలికలు) గేటు ముందు నిలిచిన వర్షపు నీరు

ఇబ్రహీంపట్నం/మంచాల/చేవెళ్ల/యాచారం/కేశంపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం మండలాల పరిధిలో గురువారం మధ్యాహ్నం ఉరుములతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. మంచాల మండల పరిధిలో గురువారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. చేవెళ్ల మండలంలో గురువారం ఉదయం తెల్లవారుజాము నుంచి 9 గంటల వరకు మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. పలు ప్రభుత్వ పాఠశాల ఆవరణల్లో వర్షపు నీరు భారీగా నిలిచింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందికి గురయ్యారు. యాచారం మండలంలోని చౌదర్‌పల్లి, చిన్నతూండ్ల, దర్మన్నగూడ, గున్‌గల్, మాల్, మేడిపల్లి, నందివనపర్తి,కుర్మిద్ద తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. గంటన్నర పాటు వర్షంకురియడంతో పత్తి విత్తనాలకు మేలు కలుగుతుందని రైతులు చెప్పారు. చిన్నతూండ్ల, కుర్మిద్ద, నజ్దిక్‌సింగారం తదితర గ్రామాల్లో అంతర్గత రోడ్లపై నీరు నిలవడతో జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కేశంపేట మండలంలో గురువారం మధ్యాహ్నం వర్షం దంచికొట్టింది. వేములనర్వ, చింతకుంటపల్లి, కాకునూర్, సుందరాపురం, కేశంపేట, చౌలపల్లి, బొదునంపల్లి, లేమామిడి, నిర్దవెల్లి, తొమ్మిదిరేకుల, లింగంధన, కొండారెడ్డిపల్లి, పోమాల్‌పల్లి, ఇప్పలపల్లి, కొత్తపేట, సంతాపూర్, కొనాయపల్లిలో వర్షం పడింది. ఒక్కసారిగా కుండపోతగా వర్షం కురిసింది.



యాచారం : మాల్ ఉన్నత పాఠశాల ఆవరణలో నీరు

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

కేశంపేట/మొయినాబాద్ రూరల్/ఆమనగల్లు/షాబాద్/మాడ్గుల, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కేశంపేట మండలంలో భూ భారతి రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. నిర్దవెల్లిలో తహసీల్దార్ అజాం అలీ నేతృత్వంలో సదస్సును నిర్వహించారు. రెండు రోజులకు 20 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. వేములనర్వలో డీటీ గీత ఆధ్వర్యంలో సదస్సు కొనసాగింది. మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్ మొయినాబాద్ మండలం చిలుకూరు, కనకమామిడిలో నిర్వహించిన సదస్సులో పాల్గొన్నారు. రైతుల భూ సమస్యల సత్వర పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదపడుతాయని తహసీల్దార్ లలిత అన్నారు. ఆమనగల్లు మండలం పోలెపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల మేలుకోసమే భూభారతి చట్టాన్ని ప్రజల వద్దకే తీసుకువచ్చి భూసమస్యలను పరిష్కరించడం ఈ సదస్సు ప్రధాన లక్ష్యమని టీపీసీసీ కార్యదర్శి ఎన్. రాంరెడ్డి అన్నారు. షాబాద్ మండలం మాచన్‌పల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. మాడ్గుల మండలంలోని ఇర్విన్ గ్రామంలో నిర్వహించిన సదస్సులో తహసీల్దార్ వినయసాగర్ పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు.

సంక్షిప్తంగా

ఆమనగల్లు : రైతులు భూసార పరీక్షల ఆదారంగా పంటలు సాగు చేసి పెట్టుబడులు తగ్గించుకొని దిగుబడులు పెంచుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు మాధవి, మీనాక్షిలు అన్నారు. మేడిగడ్డ తండాలో గురువారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏవో శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

తలకొండపల్లి : ఇందిరమ్మ పథకంతో నిరుపేదల దశాబ్దాల సొంతింటి కల సాకారం అవుతుందని మాజీ ఎంపీపీ లక్ష్మీదేవి రఘురాములు, కాంగ్రెస్ పార్టీ సేవాదల్ రాష్ట్ర కార్యదర్శి కానుగుల దశరథంలు అన్నారు. వెంకట్రావ్‌పేటలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు.

కడ్తాల్ : కడ్తాల్ మండల బీజేపీ నూతన కార్యవర్గాన్ని మండలాధ్యక్షుడు దోనాదుల మహేశ్ ప్రకటించారు. బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు వేముల నరేందర్‌రావు ఆమోదం మేరకు పూర్తి కమిటీని ప్రకటించినట్లు బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు మాలే శ్రీశైలంగౌడ్ పేర్కొన్నారు. బీజేపీ మండల ఉపాధ్యక్షులుగా సిద్దిగారి కుమార్, గడ్డం వెంకటేశ్, సామ బలవంత్ రెడ్డి, బాణావత్ బుజ్జి, ప్రధాన కార్యదర్శిగా పొగాకు వెంకటేశ్, సంతోజు విక్రాంత్, మండల కార్యదర్శిగా నేనావత్ దశరథ్‌నాయక్, ఉదరి కుమార్, జంగం సుగుణ సాయిలు, ఈర్లపల్లి మల్లేశ్, మండల కోషాధికారిగా ఈర్లపల్లి రాధికతో పాటు మండలంలోని అన్ని గ్రామాల నుంచి 35మంది మండల కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు వివరించారు.

కొత్తూర్ : ఇన్ముల్‌నర్వలో ఇందిరమ్మ ఇళ్లకు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి శంకుస్థాపనలు చేశారు. లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేశారు. షాద్‌నగర్ ఏఎంసీ డైరెక్టర్ రవి, నాయకులున్నారు.

కేశంపేట : బీజేపీ మండలాధ్యక్షురాలు రొల్లు రాధిక బైర్కాన్‌పల్లిలో రేషన్ దుకాణంలో ఉచిత రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. రొల్లు రఘురాములు గౌడ్, కుమార్ యాదవ్, కొట్టం అశోక్ రెడ్డి ఉన్నారు.

మెయిన్ రోడ్డు విస్తరణకు.. మార్కింగ్

షాద్‌నగర్ అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణ మెయిన్ రోడ్డు విస్తరణ కోసం గురువారం అధికారులు మార్కింగ్ చేశారు. ఆర్‌అండ్‌బీ ఈఈ రవీందర్‌కుమార్, షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్ సునితలు హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్ ప్రకారం మార్కింగ్ చేశారు. రోడ్డు మధ్య నుంచి 75 ఫీట్ల వెడల్పుతో రెండు వైపులా మార్కింగ్ ఇచ్చారు. షాద్‌నగర్ పాత జాతీయ రహదారి చౌరస్తా నుంచి రైల్వే స్టేషన్ వరకు రోడ్డును విస్తరించాలని హెచ్‌డీఏ మాస్టర్ ప్లాన్ వేసింది. రోడ్డును మార్కింగ్ చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఏఈ రాజశేఖర్, మున్సిపల్ ఏఈలు సాయికిరణ్, రాయుడులు పాల్గొన్నారు.

భూ కబ్జాపై అధికారుల స్పందన.. ఫెన్సింగ్ తొలగింపు

కేశంపేట, జూన్ 12(ఆంధ్రజ్యోతి): భూ కబ్జాపై రెవెన్యూ అధికారులు స్పందించారు. మూడు ఎకరాలకు వేసిన ఫెన్సింగ్‌ను తొలగించారు. మండల పరిధిలోని చింతకుంటపల్లి శివారులో సర్వేనెంబర్ 98లో పలుగుగుట్ట(క్వార్జ్) మూడు ఎకరాల ప్రభుత్వ భూమికి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఫెన్సింగ్ వేయించారు. గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో గురువారం ఆర్ఐ చెన్నకేశవులు సిబ్బందితో కలిసి భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ భూమిలో పాతిన కడీలను తొలిగింపచేశారు. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రెవెన్యూ సిబ్బంది జంగయ్య, గ్రామస్థులు ఉన్నారు.

శివరాజ్ కుటుంబ సభ్యులకు పరామర్శ

కడ్తాల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందిన విశ్రాంత ఉద్యోగి, కురుమ సంఘం రాష్ట్ర నాయకుడు కడారి శివరాజ్ కుటుంబాన్ని గురువారం కడ్తాల మండల బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. శివరాజ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన కుమారులు రమేశ్, రామకృష్ణ, హర్షవర్ధన్‌లను పరామర్శించారు. పరామర్శించిన వారిలో డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పరమేశ్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు లచ్చిరామ్‌నాయక్, గోపాల్, చంద్రమౌళి, గంప శ్రీను, వెంకటేశ్, మహేందర్‌రెడ్డి, తదితరులున్నారు.

క్రైం కార్నర్

చెరువులో చేపలు మృత్యువాత

విష ప్రయోగంతోనే చనిపోయాయని బాధితుడి ఫిర్యాదు

చౌదరిగూడ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): తుప్పుగూడెం చెరువులో రూ.80వేల విలువైన చేపలు మృతిచెందాయి. కొందుర్గు మండల కేంద్రంలోని తుప్పుగూడెం చెరువులో కాంట్రాక్టర్ పెరుమాళ్ల చంద్రశేఖర్ ఏపీలోని భీమవరం నుంచి గతేడాది రూ.లక్ష వెచ్చించి చేప పిల్లలను కొనుగోలు చేసి చెరువులో వదిలాడు. ఈ ఏడాది వేసవిలో దాదాపు రూ.40 వేల విలువైన చేపలను విక్రయించాడు. చెరువులో ఉన్న మిగిలిన చేపలు విషప్రయోగంతో మృత్యువాతపడ్డాయని, రెండు రోజుల క్రితం చెరువులో విష పదార్థం కలపడంతోనే చేపలు మృతి చెందాయని బాధితుడు చంద్రశేఖర్ వాపోయాడు. ఈమేరకు గురువారం కొందుర్గు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

విద్యుదాఘాతంతో జీవాల మృతి

చౌదరిగూడ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో జీవాలు మృతిచెందిన ఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. జిల్లేడ్ గ్రామంలోని వ్యవసాయ పొలంలో పశువులు మేతకోసం వెళ్లడంతో అక్కడ తెగిపడి ఉన్న విద్యుత్ వైర్లు తగలడంతో మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన మీదిగడ్డ రాఘవకు చెందిన ఒక గేదె, చింజేటి సాయిలుకు చెందిన రెండు గేదెలు, ప్రభాకర్‌కు చెందిన ఆవు మృతి చెందాయి. కాగా, వాటి విలువ 2.5లక్షల వరకు ఉంటుందని తెలిపారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే మృత్యువాతపడినట్లు స్థానికులు ఆరోపించారు.

బొలెరో వాహనం బోల్తా.. తప్పిన ప్రమాదం

చౌదరిగూడ, జూన్ 12(ఆంధ్రజ్యోతి): డ్రైవర్ అజాగ్రత్తగా వాహనాన్ని నడపడంతో బొలెరో వాహనం అదుపుతప్పి బోల్తాపడిన ఘటన గురువారం జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. లచ్చంపేటకు చెందిన బొలెరో వాహనం గురువారం సాయంత్రం వనంపల్లిలో టమాట బాక్సుల లోడ్ వేసుకొని తుమ్మలపల్లికి వైపు వస్తుండగా కంకల్ రోడ్డు వద్దకు రాగానే డ్రైవర్ అతివేగంగా నడపడంతో అదుపుతప్పి రోడ్డు పక్కన పడిపోయింది. దాంతో డ్రైవర్ కిందకు దూకాడు. బోల్తాపడిన బొలెరో వాహనాన్ని ట్రాక్టర్ సహాయంతో పైకి ఎత్తారు. కాగా, ఈ విషయమై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

మైనార్టీ కార్పొరేషన్ ద్వారా లక్ష కుటుంబాలకు ఉపాధి

(ఐదో పేజీ తరువాయి)

45వేల మంది ముస్లింలకు రూ.850 కోట్లు ఆర్థిక సాయం అందించనున్నట్లు ఒబేదుల్లా కొత్వాల్ వెల్లడించారు. అదేవిధంగా రాష్ట్రంలో 5వేల మంది వితంతు, విడాకులు, ఒంటరి మహిళలకు ఒక్కొక్కరికి రూ.50వేల చొప్పున రూ.25 కోట్లు సాయమందించినట్లు ఆయన వెల్లడించారు. 6వేల మంది ముస్లిం, మైనార్టీ పిల్లలకు కార్పొరేషన్ ద్వారా వృత్తి నైపుణ్య శిక్షణ ఇప్పించి ఉపాధి చూపుతున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ముస్లింల బాగోగులను పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. సమావేశంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో విపక్షాలు ఉనికిని కాపాడుకోవడానికి ప్రభుత్వంపై దుష్ప్రచారాలు చేస్తున్నాయని మండిపడ్డారు. దేశంలో బీజేపీ మత రాజకీయాలు సాగిస్తుందని, రాజ్యాంగ విలువలను కాలరాస్తుందని మండిపడ్డారు. కల్వకుర్తి నియోజకవర్గానికి మరో 500 కుట్టు మిషన్లు అందించాలని ఈ సందర్భంగా ఒబేదుల్లా కొత్వాల్‌ను కోరారు. మైనార్టీ సంక్షేమ శాఖ డీఎం నవీన్‌రెడ్డి మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గానికి ఇందిరమ్మ మైనార్టీ మహిళా శక్తి పథకం ద్వారా 367 కుట్టు మిషన్లు మంజూరైనట్లు తెలిపారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ఆమనగల్లు పట్టణంలో గురువారం కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాలకు చెందిన 40మందికి తహసీల్దార్లు ముంతాజ్, లలిత, నాగార్జునలతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి, ఒబేదుల్లా కొత్వాల్ చెక్కులు పంపిణీ చేశారు.

రూ.600 కోట్లతో రోడ్ల అభివృద్ధి : ఎమ్మెల్యే కసిరెడ్డి

కల్వకుర్తి నియోజకవర్గంలో రూ.600 కోట్లతో గ్రామీణ రోడ్లను ఆధునికీకరించి అభివృద్ధి చేస్తున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు. ఆమనగల్లు మండలం మేడిగడ్డ-శంకర్ కొండ కత్వవాగుపై ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద రూ. 3.10 కోట్లతో నూతనంగా నిర్మించిన వంతెనను గురువారం ఒబేదుల్లా కొత్వాల్‌తో కలిసి ఆయన ప్రారంభించారు.

ఆయా కార్యక్రమాలలో మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ్మా, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, మైనార్టీ సంక్షేమ శాఖ డీఎం నవీన్ రెడ్డి, టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ మార్కెట్ చైర్మన్ భట్టు కిషన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్లు లలిత, ముంతాజ్, నాగార్జున, స్పెషలాఫీసర్ శోభారాణి, ఎంపీడీవో మాధురి, మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ పీఆర్ ఈఈ సుదర్శన్ రెడ్డి, డీఈ శ్రీనివాస్ రెడ్డి, ఏఈ అభిషేక్ పాల్గొన్నారు.

ఉద్యమ స్ఫూర్తితో మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ, మానవాళి మనుగడను దృష్టిలో ఉంచుకొని ప్రతీ ఒక్కరు ఉద్యమ స్ఫూర్తితో మొక్కలు నాటి సంరక్షించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పిలుపు నిచ్చారు. ఆమనగల్లు మున్సిపాలిటీ వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కమిషనర్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే అధికారులు, నాయకులు, విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఎంపీడీవో మాధురి, ఎంఈవో పాండు, ఏఎంసీ చైర్‌పర్సన్ గీత నర్సింహ, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, భట్టు కిషన్‌రెడ్డి, గుర్రం కేశవులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం

యాచారం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నందివనపర్తి గల శ్రీ ఓంకారేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గురువారం ఉదయం శివపార్వతుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామస్థులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

మంత్రి అడ్లూరిని కలిసిన ఎమ్మెల్యే యాదయ్య



చేవెళ్ల, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను హైదరాబాద్ నగరంలో గురువారం సాయంత్రం చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య మార్యదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో చేవెళ్ల మాజీ జెడ్పీటీసీ మాలతి కృష్ణారెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు ఉన్నారు.